
ప్రజాశక్తి
సోమవారం 3 ఏప్రిల్ 2023
5
విజయనగరం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా ఆదివారం 49, 50 డివిజన్లలో రూ.54 లక్షలతో చేపట్టనున్న పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్లో రూ.8 లక్షలతో రహదారులు, 50వ డివిజన్లో పైపులైను, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్‌ఛార్జి కంటుభుక్త తవిటిరాజు, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైసిపి 49వ డివిజన్ ఇన్‌ఛార్జి కనుగుల రాజా, సీనియర్ నాయకులు రొంగలి పోతన్న తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలకు తప్పని తిప్పలు

సర్వజనావళికి వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అడుగడుగునా అవస్థలు ఎదురవుతున్నాయి. ఓవైపు వైద్య పోస్టుల ఖాళీ, మరోవైపు అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సీటీ, ఎంఆర్ఐ స్కానర్లు, లేబోరేటరీలోని పనిముట్లు పని చేయడం లేదు. కొన్ని రకాల వైద్య పరీక్షలు కూడా అందుబాటులో లేవు. దీంతో జిల్లా కేంద్రాస్పత్రి నుంచి మెడికల్ కాలేజీ (సర్వజన ఆస్పత్రి)గా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- మొరాయించిన సిటి, ఎంఆర్ఐ స్కానర్లు
- అందుబాటులోకి రాని సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు
- భర్తీ కాని మత్తు వైద్యుల పోస్టులు
- సర్వజన ఆసుపత్రిలో దుస్థితి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైన నేపథ్యంలో వైద్య విధాన పరిషత్తు ఆధ్వర్యంలో నడిచే విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిని, దానికి అనుసంధానంగా ఉన్న ఘోషా ఆస్పత్రిని కళాశాల సేవలకు కేటాయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా పేరు మార్చారు. పేరు మార్చుచేసినా, మెడికల్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేసినా వైద్యసేవలు మాత్రం పెద్దగా విస్తరించలేదు. వైద్యుల సంఖ్య, లేబోరేటరీ సేవలు మెడికల్ కాలేజీకి తగ్గట్టు విస్తరించకపోవడమే ఇందుకు కారణం. నిత్యం అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించే ఈ ఆస్పత్రిలో రెండు మత్తు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరు లేకుండా శస్త్రచికిత్సలు చేయడమే సాధ్యం కాదు. ఇటువంటి పోస్టు ఖాళీగా ఉండడంతో మిగిలిన వారిపై పనిభారం, మానసిక ఒత్తిడి ఉంటుందనడంలో సందేహం లేదు. శస్త్రచికిత్సలు సకాలంలో చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. సిటి, ఎంఆర్ఐ స్కానింగ్ తదితరాలు ప్రభుత్వ పరంగా లేవు. వీటిని ఎన్ఆర్ఐ కార్పొరేట్ ఆస్పత్రి భాగస్వామ్యంతో సేవలందిస్తున్నారు. కొద్ది రోజులుగా ఈ మిషన్లు మొరాయించడంతో ఈ స్కానింగులు అవసరమైన రోగులు ప్రయివేటుగా చేయించుకునే స్థోమత లేక, స్థానికంగా ఈ రకమైన సేవలు అందుబాటులో లేక సతమతమౌతున్నారు. ఈ విషయం నిన్నగాక మొన్న జరిగిన సమీక్షా సమావేశంలోనే తేటతెల్లమైంది.

వీటితోపాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం, కీమో, రేడియేషన్ సేవలు స్థానికంగా అందుబాటులో లేఃపోవడంతో కొన్ని కేసులను విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయక తప్పని పరిస్థితి. మరోవైపు జిల్లా కేంద్రాస్పత్రిని మెడికల్ కాలేజీగా మార్చుచేశాక వైద్య సేవల విషయంలో రోగుల ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. అందుకు తగ్గట్టే రోగుల ఒపి, ఐపి కూడా పెరిగాయి. కానీ, సొంతంగా స్కానింగ్ మిషన్లే లేకపోవడం, థైరాయిడ్ వంటి చిన్న చిన్న టెస్టులు కూడా స్థానికంగా చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చివరికి అత్యవసర విభాగాల్లో వైద్యులు, సిబ్బంది, విజిటర్స్ ధరించాల్సిన నీలిరంగు, ఆకుపచ్చ గౌన్లు కూడా అందుబాటులో లేవంటూ సాక్షాత్తూ వైద్యాధికారులే అంగీకరించడం విస్మయానికి గురిచేస్తోంది.

ఆశ.. నిరాశ

ఆశాల ఆశలు నిరాశగానే మిగిలాయి. కష్టానికి తగిన జీతభత్యాలు లేక అరకొర వేతనంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వైద్య సేవలలో ముందుండి నడిపించే ఆశాలు.. ప్రతి కుటుంబానికీ నేస్తాలుగా ఉంటారు. ప్రభుత్వ సంక్షేమ సేవలలో వీరి నుంచి ప్రతి ఇంటికి సమాచారం ముందుగా అందిస్తారు. అలాంటి ఆశా కార్యకర్తలను ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. ఎన్నో వినతులు, విజ్ఞప్తులు చేసినా పాలకుల్లో స్పందన లేకపోవడంతో ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు సిద్ధమవుతున్నారు.


ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు (ఫైల్)

- పని భారం ఎక్కువ.. వేతనం తక్కువ
- వినతులిచ్చినా పట్టని పాలకులు
- 'చలో ఢిల్లీ'కి బయల్దేరిన ఆశావర్కర్లు

ప్రజాశక్తి-రేగిడి

రాజాం నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాల పరిధిలో 120 పంచాయతీ ఉన్నాయి. దాదాపు 368 మంది ఆశా కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు 24 గంటలు పనిచేస్తూ 365 రోజులూ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రూ.10 వేలు జీతం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామాల్లో 1200లోపు జనాభా ఉన్న ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందించడంలో ముందుంటారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులతోపాటు జ్వరాలు, అతిసార, ఇతరత్రా సమస్యల పట్ల ముందుగా తెలుసుకొని వీరు వైద్యాధికారులకు సమాచారం అందిస్తారు. ఎన్ని సేవలు చేసినా వీరికి ప్రభుత్వం ఇచ్చే అరకొర జీతంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.


గ్రామాల్లో ఫీవర్ సర్వే చేస్తున్న ఆశా కార్యకర్తలు (ఫైల్)

ఆశా కార్యకర్తల డిమాండ్లు

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నోసార్లు మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో తమ జీవన భృతి కష్టంగా ఉందని ఆశాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదని, పనిభారాన్ని తగ్గించాలని కోరుతున్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ జిఒని వర్తింపజేయాలని కోరుతున్నారు. కోవిడ్ కాలంలో 2020 మార్చి నుండి మరణించిన ఆశాల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇంతవరకు ఇవ్వకపోవడంలో వారి ఆశలు నిరాశలయ్యాయి. వారి కుటుంబంలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్‌హెచ్ఎం నిబంధనల ప్రకారం 1000-1200 మంది ఉన్న జనాభాకు ఒక ఆశా కార్యకర్తను నియమించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు. గౌరవ వేతనం ఒకేసారి జమ చేయాలని, సెల్‌ఫోన్లు 4జి సిమ్ ఇవ్వాలని, ఎఎన్ఎం, హెల్త్ సెక్రెటరీ నియామకాల్లో ఆశాలకు వెయిటేజ్ ఇవ్వాలని, తదితర డిమాండ్లపై చలో ఢిల్లీ కార్యక్రమానికి సిద్ధమయ్యారు.

అరకొర జీతాలతో ఇబ్బందులు



అరకొర జీతాలతో కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉంది. 10 వేల రూపాయలతో ఎలా బతికేది. ఆశా కార్యకర్తలకు 365 రోజులూ రేయింబవళ్లు పని ఉంటుంది.. పనికి తగిన జీతభత్యాలు లేవు. సేవలను ఉపయోగించుకుంటున్నారు.. కానీ మా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

-జి.పద్మ, ఆశా కార్యకర్త, ఉనుకూరు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి



ఆశాల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాలకు అర్జీలు చేసుకున్నాం... కానీ ఫలితం దక్కలేదు. అరకొర జీతాలతో కుటుంబం ముందుకు వెళ్లడం కష్టంగా ఉంది. వైద్యరంగంలో సేవలు కష్టంగా ఉన్నప్పటికీ పనులు చేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మా డిమాండ్లు నెరవేర్చాలి.

- సరస్వతి, ఆశా కార్యకర్త, రాజాం

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు వీడకుంటే..

మోడీ మెడలు వంచి తీరుతాం


విజయనగరం నుంచి ఢిల్లీకి పయనమైన సిఐటియు నాయకులు, కార్మికులు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్
- 'చలో ఢిల్లీ'కి తరలివెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు విడనాడకుంటే ప్రధాని మోడీ మెడలు వంచి, హక్కులను, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పేర్కొన్నారు. ఈ నెల 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమానికి విజయనగరం నుంచి కార్మికులు ఆదివారం ప్రత్యేక రైలులో పయనమయ్యారు. రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను, ప్రభుత్వ రంగ సంస్థలను, రైతులను దివాలా తీసేలా విధానాలను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటు న్నారని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అయిన ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పగించడం దారుణమన్నారు. కార్మికులకు ఎటువంటి హక్కులూ లేకుండా చట్టాల్లో మార్పులు తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. నల్లచట్టాలను తీసుకొచ్చి రైతులను సాగుకు దూరం చేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. వీటిన్నింటినీ వ్యతిరేకిస్తూ కార్మిక, కర్షకులు చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఢిల్లీ వెళ్లిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు బి.సుధారాణి, బి.రమణ, ఎస్.అనసూయ, గౌరునాయుడు, మద్దిల రమణ ఉన్నారు. వారికి సురేష్, సిఐటియు నాయకులు యుఎస్ రవికుమార్, టివి రమణ, తదితరులు సంఘీభావం తెలిపారు.

బొబ్బిలి : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా చలో ఢిల్లీ చేపడుతున్నట్లు ప్రజా సంఘాల నాయకులు ఎస్.గోపాలం, రెడ్డి ఈశ్వరరావు, ఎన్.వై నాయుడు, ఎ.సురేష్, కె.గంగునాయుడు తెలిపారు. బొబ్బిలి పరిసర ప్రాంతాల నుంచి చలో ఢిల్లీ వెళ్తున్న వారికి స్థానిక రైల్వేస్టేషన్లో ఆదివారం సంఘీభావం తెలిపారు.



బొబ్బిలి నుంచి ఢిల్లీకి పయనమైన ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు, రైతులు

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

127 కేంద్రాలు.. 25481 మంది విద్యార్థులు ● ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 18 వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 127 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 432 ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల నుంచి 25,481 మంది హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 1500 మంది ఇన్విజిలేటర్లను ఇప్పటికే నియమించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఇప్పటికే హాల్‌టిక్కెట్ల పంపిణీ పూర్తయింది. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలి. ఒక వేళ ఆలస్యమైనా అరగంట పాటు వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత లోపలికి అనుమతిం చేది లేదు. ఇప్పటికే విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకు రాకూడదని స్పష్టంచేశారు. విధి నిర్వహణలో ఉన్న ఏ సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు వినియోగించేందుకు అనుమతి లేదు. విద్యార్థులు బస్సుల్లో హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునే అవకాశం కల్పిస్తున్నారు. చూసిరాతలకు పాల్పడకుండా తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు.


పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన బెంచీలు

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో 127 కేంద్రాల్లో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు అన్ని సౌకర్యాలు కల్పించాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు అనువుగా ఫర్నీచర్, తాగునీరు, వెలుతురు, మరుగుదొడ్లు, వైద్యశిబిరం ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు షాపులు తెరిచి ఉంచడకుండా నోటీసులిచ్చాం. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

- బి.లింగేశ్వరరెడ్డి, డిఇఒ

నిరంతర కృషి, శ్రమ, నిబద్ధతలే

లక్ష్య సాధనకు సోపానాలు

హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు


సెమినార్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్


నిరంతర కృషి, శ్రమ, నిబద్ధతలే లక్ష్య సాధనకు సోపానాలని హైకోర్టు న్యాయమూర్తి కె.మన్మథరావు పేర్కొన్నారు. దేశంలో న్యాయవాద వృత్తిలో మార్పులు, మెలకువలపై ఆదివారం స్థానిక న్యాయ సేవా సదన్ భవన్‌లో సెమినార్ జరిగింది. సెంటర్ ఫర్ ప్రమోషన్ లీగల్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు కె.రామజోగేశ్వరరావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సిహెచ్ దామోదరరావు సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల్లో మార్పులు, నూతన చట్టాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు, విశ్లేషణలు చెయ్యడం వృత్తిలో దోహదపడుతుందని చెప్పారు. సీనియర్లు తమ అనుభవాలు, మెలకువలు, విధి విధానాలను జూనియర్లకు సమీక్షల ద్వారా తెలియజేస్తే వారికి దోహదపడతాయన్నారు. సీనియర్లు ప్రస్తుత కాలంలో ఎంతవరకు జూనియర్లకు సహకరిస్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉందన్నారు. జూనియర్లు వారి బాధ్యత ఎంతవరకు పాటిస్తున్నారో ఆలోచించు కోవాలని సూచించారు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ మెంబరు ఎన్.వి.బద్రినాథ్ మాట్లాడుతూ గతంలో సామాజిక బాధ్యతగా విధులు నిర్వర్తించేవారని తెలిపారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. తద్వారా ఉన్న చోట నుండే దేశంలో నలుమూలల కోర్టుల్లో వాద, ప్రతి వాదనలు చెప్పొచ్చన్నారు. కాలానుగుణంగా వచ్చే మార్పులు, విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బి.వి.కృష్ణారెడ్డి, బైపా అరుణకుమార్, సీనియర్లు ఐ.సురేష్, ఎస్ఎస్ రాజులు వారి అనుభవాలు, మెలకువలు వివరించారు. ఈ సెమినార్‌లో జిల్లా అదనపు న్యాయమూర్తులు కె.రాధారత్నం, షేక్ సికిందర్ భాషా, ఎం.మీనాదేవి, సీనియర్ న్యాయమూర్తులు జె.శ్రీనివాసరావు, లక్ష్మీకుమారి, సంఘం కార్యవర్గ సభ్యులు ఎ.అంజనీకుమార్, వి.జి.సంతోష్, పీటర్ మార్టిన్, సుబ్రమణ్యం, జి.రాంబాబు పాల్గొన్నారు.


జూన్ నుంచి మెస్‌ఛార్జీల పెంపు

- మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం
- ప్రజాశక్తితో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి యశోదనరావు ముఖాముఖి

రాష్ట్ర ప్రభుత్వం వసతిగృహ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచిన మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలను జూన్ నుంచి అమలు చేయన్నట్లు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.యశోదనరావు తెలిపారు. మెరుగైన విద్యను అభ్యసించేందుకు, నాణ్యమైన బోజనం, వసతి సౌకర్యాలు కల్పించేందుకు జిల్లాలో కృషి చేస్తున్నామన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. ఆ వివరాలు..

-ప్రజాశక్తి, విజయనగరంటౌన్





జిల్లాలో ఎన్ని బిసి సంక్షేమ శాఖ వసతిగృహాలు ఉన్నాయి, వాటిలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?.

జిల్లాలో ప్రీమెట్రిక్ వసతిగృహాలు 38 ఉన్నాయి. వాటిలో 31 బాలుర వసతిగృహాల్లో 1497 మంది, 7 బాలికల హాస్టళ్లలో 229 మంది విద్యార్థులున్నారు. పోస్టుమెట్రిక్ వసతిగృహాలు 15 ఉన్నాయి. వాటిలో 8 బాలుర వసతిగృహాల్లో 794 మంది, 7 బాలికల వసతిగృహాల్లో 833 మంది విద్యార్థులున్నారు.

వసతిగృహాల్లో ప్రభుత్వ భవనాలెన్ని? కొత్తగా ఏమైనా భవనాలు మంజూరు కానున్నాయా?.

జిల్లాలో ఉన్న ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో ప్రభుత్వ భవనాలు 27. 11 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. పోస్టుమెట్రిక్ వసతిగృహాల్లో ప్రభుత్వ భవనాలు 5, అద్దె భవనాలు 10 ఉన్నాయి. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నిధులకు ప్రతిపాదనలు పంపించాం. ధర్మవరం, బొబ్బిలి, భోగాపురం, అలుగోలు, చీపరుపల్లి ఇంటిగ్రేటెడ్, కలవచర్ల, కొత్తవలస, చీపరుపల్లి, బిపిపురం, బొప్పడాం, ఎంఎస్ఆర్‌పురం, బాడంగి, దత్తిరాజేరు, రావాడ వసతిగృహాలకు ప్రతిపాదించాం.

మెస్‌ఛార్జీలు పెరిగే అవకాశముందా?.

ప్రభుత్వం ఇటీవల మెస్ ఛార్జీలు పెంచుతూ జిఒ 89ను విడుదల చేసింది. పెంచిన మెస్‌ఛార్జీలు జూన్ ఒకటో తేది నుంచి అమలు కానున్నాయి. ప్రస్తుతం 3 నుంచి 5వ తరగతి వరకు రూ.వెయ్యి ఉంటే రూ.1150కు పెంచారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1250 నుంచి రూ.1400కు, కళాశాల విద్యార్థులకు రూ.1400 నుంచి 1600కు పెంచారు.

కాస్మోటిక్స్ ఛార్జీలు పెరిగే అవకాశముందా?.

మెస్ ఛార్జీలతో పాటు కాస్మోటిక్స్ ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇవి కూడా జూన్ ఒకటో తేది నుంచి అమల్లోకి రానున్నాయి. 3 నుంచి 5వ తరగతి వరకు బాలురకు రూ.100 నుంచి 125కు, బాలికలకు రూ.110 నుంచి 130కు, 6 నుంచి పదో తరగతి వరకు బాలురకు రూ.125 నుంచి 150కి, బాలికలకు రూ.160 నుంచి 200కు పెంచారు. కళాశాల విద్యార్థులకు బాలురకు రూ.125 నుంచి 200, బాలికలకు రూ.160 నుంచి 250కి పెంచారు. వీటితోపాటు తల కటింగ్ ఛార్జీలు రూ.30 నుంచి 50కి పెరిగాయి.

పదో తరగతి పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు?.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ ఏడాది జిల్లాలోని బిసి సంక్షేమ వసతిగృహాల నుంచి 350 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 90 శాతం దాటి ఉత్తీర్ణతయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది 84 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి, మంచిఫలితాలు వస్తాయని ఆశీస్తున్నాం.

పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు ఎలా సన్నద్ధం చేశారు?.

పదో తరగతి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే కాకుండా వసతిగృహాల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాం. వసతిగృహాల్లో ప్రత్యేకంగా ట్యూటర్లను ఏర్పాటు చేసి చదివించడం, పరీక్షలు నిర్వహించడం వంటి జాగ్రత్తలు తీసుకున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం పెట్టి వారి చదువు, ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం.

జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ఎంత మంది విద్యార్థులకు అందిస్తున్నారు?.

జిల్లాలో జగనన్న విద్య, వసతిదీవెన పథకాల కింద ఈ విద్యా సంవత్సరంలో 40,569 మంది బిసి విద్యార్థులకు రూ.129.86 కోట్లు, 2835 మంది ఇబిసి విద్యార్థులకు రూ.8.45 కోట్లు, 1006 మంది కాపు విద్యార్థులకు రూ.2.96 కోట్లు అందించారు.



బాధితురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న కర్రోతు బంగార్రాజు

రూ.10 వేలు ఆర్థిక సాయం

భోగాపురం : మండలంలోని ముక్కాం గ్రామంలోని గుంటు గరగమ్మ ఇల్లు ఇటీవలే అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలుసుకొని ఆమెకు రూ. పదివేలు ఆర్థిక సాయాన్ని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో ముక్కాం ఎంపిటిసి గనగళ్ల బాబాజీ, భోగాపురం మండల బీగల్ సెల్ అధ్యక్షులు గరికిన చిన్న రాములు, టిడిపి నాయకులు బడి నాయుడు, గనగళ్ల గరగయ్య, కోలా గురుప్పలు, గరికిన రామస్వామి, అప్పాయి, కొంగవాని పాలెం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో వైసిపి విఫలం

బొబ్బిలి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన విమర్శించారు. కోటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో ఖాళీలను భర్తీ చేస్తామని, పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో వైసిపి హామీ ఇచ్చినప్పటికీ ఉపాధి కల్పనలో విఫలమైందన్నారు. మోసపూరితమైన హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. టిడిపి హయాంలో రాష్ట్ర గ్రోత్ బాగా ఉండేదని, ఇప్పుడు బాగా పడిపోయిందన్నారు. ప్రభుత్వ శాఖలో ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ బోగస్ అని రాష్ట్రానికి ఏమి లాభం లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపిని ఓడించారన్నారు. సాధారణ ఎన్నికల్లో కూడా వైసిపికి ఓటమి తప్పదని హెచ్చరించారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో మే 15,16న చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చాగంటి ప్రవచనాలు కోసం ఆరేళ్ల నుంచి ప్రయత్నం చేస్తున్నామని, ఇప్పటికి ఆయన అవకాశం ఇచ్చారని చెప్పారు. మే 15 సాయంత్రం రాజా కళాశాల మైదానంలో ప్రవచనం, 16న ఉదయం విద్యార్థులతో ముఖాముఖి, సాయంత్రం ప్రవచనం ఉంటుందన్నారు. బొబ్బిలి పరిసర ప్రాంతాల్లో ఆలయాలను సందర్శిస్తారని చెప్పారు.

జామిలో కుండపోత వర్షం

జామి : మండలంలో కుండపోత వర్షం కురిసింది. పగలు రికార్డ్ స్థాయిలో ఎండలు కాయడంతో జనం వడ దెబ్బకు గురయ్యారు. కానీ సాయంత్రానికి భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఎడతెరిపి లేకుండా సుమారుగా గంట పాటు వర్షం బీభత్సం సృష్టించింది. ఇప్పటికే వర్షాలకు మామిడి పంట తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. తాజాగా కురిసిన వర్షానికి ఉన్న మామిడి పింజలు సైతం నేల రాలాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే వర్షాలు ప్రారంభం కావడం కొంత ప్రజలు వేడి నుంచి ఉపశమనం కలిగినప్పటికీ, మామిడి, మొక్కజొన్న ఇతర పంటలు మాత్రం తీవ్రంగా దెబ్బతింటున్నాయి నేపథ్యంలో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలను అందిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్

కొత్తవలస : మండలం లోని తుమికా పల్లి గ్రామంలో వర్ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ వరిక మార్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంటరి వృద్ధులకు నిత్యావస రాలను పంపిణీ చేశారు. విజయనగరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ పాల్గొని మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రానున్న రోజుల్లో ట్రస్ట్‌కు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తీగల గుప్తా, పూసర్ల రామన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ రమణ, వెంకటరత్నం, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, సభ్యులు నగేష్, వరహాలు, ప్రసాద్, ధర్మ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

బొబ్బిలి: పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ చెరువు గట్టులుపైన ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తక్షణమే వాటిని మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం స్పందించి తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు కోట అప్పన్న అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తారకరామ కాలనీని ఆనుకుని ఉన్న చీపురు బందును ఇప్పటికే ఓ ప్రైవేట్ లే అవుట్‌కు లబ్ధి చేకూరేలా హడావుడిగా సిమెంట్ రోడ్డు వేశారన్నారు. అమ్మి గారి కోనేరు గట్టుపై అక్రమ ఇల్లు కట్టడాలు చేపడుతున్నారని, ఇందిరమ్మ కాలనీలో ఇప్పటికీ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వాటిని అరికట్టడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగెలు



ప్రమాదకరంగా ఉన్న తీగలు

వేపాడ : మండలంలోని బొద్దాం ప్రధాన రోడ్డుకి ఆనుకొని ఉన్న గొర్లి సూరిబాబు ఇంటి వద్ద, ఆంజనేయ గుడి దగ్గరిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. సచివాలయంలో పనిచేస్తున్న జిఎల్ఎంకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తక్షణమే వైర్లు సరిచేసి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెదమానాపురం ఎస్ఐగా శిరీష

దత్తిరాజేరు : మండలంలోని పెదమనాపురం ఎస్‌గా జి. శిరీష ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బమ్మిడి భాగ్యం బొబ్బిలి టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ శిరీష మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శిరీష

సూరిబాబుకు ఘన సన్మానం

కొత్తవలస : వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు గవర సూరిబాబు, ఇటీవల జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా స్థానిక ఎబిసి క్లబ్ అధ్యక్షులు, న్యాయవాది గొడుగుల మహేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా గవర సూరిబాబు వాలీబాల్ క్రీడకు వన్నె తెచ్చారని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా గవర సూరిబాబు మాట్లాడుతూ కప్పులు, సీల్లు రావడం కంటే, తాను నేర్పిన విద్యతో ప్రముఖ ఆటగాడిగా ఎదిగితే అదే తనకు గొప్ప విషయంగా భావిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మూర్యారి నాని, డాక్టర్ తెన్నేటి సుబ్బారావు, పిఎసిఎస్ అధ్యక్షులు, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, ఎంపిటిసి కాసు, ఎఫ్‌బిసి క్లబ్ ప్రెసిడెంట్ సూరిబాబు, కొత్తవలస మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సతీష్, ఎమ్మిగస్ క్లబ్ రాజు, కొత్తవలస వర్తక సంఘం ప్రెసిడెంట్ మూర్యారి తాత పాల్గొన్నారు.

దాడితల్లి సిరిమానోత్సవానికి చెట్టు సేకరణ

బొబ్బిలి : గొల్లపల్లి శ్రీదాడితల్లి పండుగ సిరిమానోత్సవానికి సిరిమాను చెట్టును ఆదివారం సేకరించి కొట్టారు. గొల్లపల్లి సమీపంలో మొక్కుకున్న చెట్టును టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన, మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు గంట్లు పెట్టి కొట్టారు. మే1,2,3న శ్రీదాడితల్లి గ్రామదేవత పండుగ జరగనుంది. 2న సిరిమనోత్సవం జరగనుంది.

24,25,26న మల్లమ్మపేట పండుగ

ఈనెల 24,25,26న మల్లమ్మపేట శ్రీకొత్తపోలమ్మతల్లి గ్రామ దేవత పండుగ నిర్వహించేందుకు గ్రామ కమిటీ నిర్ణయించింది. గ్రామ దేవత పండుగ నిర్వహణకు ఆదివారం అమ్మవారి ఘటాలను ఊరేగించారు.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి–బొబ్బిలి

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనకు విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. టెన్త్ విద్యార్థుల చదువు తీరును గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, ఎపి గురుకుల పాఠశాలలో ప్రజాశక్తి పరిశీలించింది. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 46మంది టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 46మంది విద్యార్థులను ఏడు గ్రూపులుగా విడదీసి చదివిస్తున్నారు. ఎపి గురుకుల పాఠశాలలో 77మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. పాఠశాలలో ప్రత్యేక టైమ్ టేబుల్ అమలు చేసి ప్రతి సబ్జెక్టులో మైక్రో లెవెల్ టెస్టు నిర్వహిస్తున్నారు. మైక్రో లెవెల్ టెస్టులో తప్పులు వస్తే మళ్లీ ఆయా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు. గ్రాండ్ టెస్ట్, ప్రీ ఫైనల్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నారు.

ప్రతి సబ్జెక్టుపై గంట ప్రత్యేక తరగతులు

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రతి సబ్జెక్టుపై గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఏడు



గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న విద్యార్థినులు



గ్రూపులుగా విద్యార్థులను విడదీసి చదివిస్తున్నాం. గత ఆరేళ్ల పబ్లిక్ పరీక్షా పేపర్లతో ప్రాక్టీసు చేయించాం.

- జె.శివసాయికుమారి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బొబ్బిలి

ప్రత్యేక టైమ్ టేబుల్ ఇచ్చారు



పదిలో మంచి మార్కులు సాధనకు ఉపాధ్యాయులు ప్రత్యేక సమయం కేటాయించారు. ప్రత్యేక టైమ్ టేబుల్ ప్రకారం ప్రతిరోజు చదువుతున్నాను. మంచి మార్కులు సాధించేందుకు ఎంతో దోహదం చేస్తుంది.

ఎ. పావని, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, బొబ్బిలి


పదేపదే నివృత్తి చేశారు



తరగతి గదిలో బోధించే పాఠాలు అర్థం కాకపోతే ఉపాధ్యాయులను మళ్లీ మళ్లీ అడిగి తెలుసుకున్నాం. మంచి మార్కులు సాధించేందుకు ప్రతిరోజు ప్రణాళికాబద్ధంగా చదువుతున్నాం. ఫలితాలు సాధనకు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తున్నాం.

-ఎస్.సావిత్రి , గిరిజన బాలికల పాఠశాల, బొబ్బిలి

ప్రతి సబ్జెక్టులో మైక్రో లెవెల్ టెస్టు



గురుకుల పాఠశాలలో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి సబ్జెక్టులో మైక్రో లెవెల్ టెస్టు నిర్వహిస్తున్నాం. పాఠశాలలో ప్రత్యేక టైమ్ టేబుల్ అమలు చేశాం. స్టడీ వర్స్ నిర్వహించి ఒకటి, రెండు మార్కులు ప్రశ్నలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. శతశాతం ఉత్తీర్ణత సాధిస్తాం. 80శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చేలా ప్రణాళికబద్ధంగా పని చేస్తున్నాం.

కె. రఘునాథ్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, బొబ్బిలి

టెస్టు బుక్ బాగా చదువుతున్నాను



టెస్టు బుక్ బాగా చదువుతున్నాను. మంచి మార్కులు సాధనకు ఇంపార్టెంట్ ప్రశ్నలపై సాధన చేస్తున్నాం. టెస్ట్ బుక్ చదవడం వలన ఏప్రశ్న ఇచ్చిన రాసే సామర్థ్యం వచ్చింది.

వి.భరత్ కుమార్, గురుకుల పాఠశాల, బొబ్బిలి

లోపాలను సరి చేసుకుంటున్నాం



పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్వహించే డైలీ టెస్టు, ప్రత్యేక టెస్టులలో లోపాలను గుర్తించి సరి చేసుకుంటూన్నాం. సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు టెస్ట్ బుక్ చదువుతున్నాం. అన్ని సబ్జెక్టులు, లాంగ్వేజ్ లలో 100 మార్కులకు 100మార్కులు సాధిస్తాను. **ఎం.గౌతమ్, టెన్త్ విద్యార్థి, గురుకుల పాఠశాల**

నిరుపయోగంగా నీటి తొట్టెలు

- మూగజీవాలకు అందని నీరు
- ప్రభుత్వ నిధులు దుర్వినియోగం
- చేతులెత్తేసిన అధికారులు

ప్రజాశక్తి– రేగిడి

పశువుల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ బాధ్యత గ్రామపంచాయతీ అధికారులదే అయినా చేతులెత్తేశారు. రాజాం నియోజకవర్గంలో నీటి తొట్టెలు నిర్మాణ పరిస్థితి మరీ దారుణంగా తయారయింది. నియోజకవర్గంలో రాజాంతోపాటు రేగిడి, సంతకవిటి, వంగర మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 160కి పైగా నీటి తొట్టెలు నిర్మించారు. ఒక్కో నీటి తొట్టెకు అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.20వేలకు పైగా నిధులు వెచ్చించింది. ఈ లెక్కన మొత్తం రూ. 32 లక్షలకు పైగా ఖర్చు చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపట్టి వీటి నిర్వహణ బాధ్యత మాత్రం గ్రామపంచాయతీలకు అప్పగించారు. తొట్టెలలో నీటిని ఉండేందుకు నిర్మాణంలోనే జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు ఇచ్చారు. రక్షిత మంచి నీటి పథకాలు ఉన్నచోట మాత్రమే నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇందులో 15శాతం మినహా మిగిలినవి నీటి వనరులు ఉన్నచోటే నిర్మించారు. పంచాయతీల ఆదాయంతో నీటి తొట్టెల నిర్వహణ చేపట్టాలని నిర్దేశించారు.

బాధ్యతల నుంచి తప్పుకున్న పంచాయతీలు

గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెల నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించినా ఆ బాధ్యతల నుండి ఆయా పంచాయితీలు తప్పుకోవడంతో నీటి తొట్టెలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని పంచాయితీల్లో నీటి తొట్టెలు మట్టిలో కూరుకుపోయాయి. మరికొన్ని పంచాయితీల్లో పారిశుధ్యం కాలువల మధ్య కొట్టుమిడుతున్నాయి. ఇంకొన్ని పంచాయితీలో నీటి తొట్టెలు బయోగ్యాస్‌కు ఉపయోగిస్తున్నారు. దీంతో లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని పలు గ్రామాల రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడకూడదని..

వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని పశువులు తాగునీటికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో పశుసంవర్ధక శాఖ సూచనలు మేరకు పల్లెల్లో నీటి తొట్టెలను నిర్మించారు. నిధులు ఖర్చయినా, సమస్య పరిష్కారం కాలేదని పలువురు వాపోతున్నారు. గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్టెలు వినియోగంలో లేకపోవడంతో నీటి గుంతలు, చెరువుల్లో అడుగంటిన బురద నీటిని పశు పక్షాదులు తాగడంతో పశువుల్లో ఎక్కువగా వ్యాధులు సోకుతున్నాయి. గత మూడేళ్ల నుంచి ఎండలు తీవ్ర ప్రభావంతో పాటు వడదెబ్బలకు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి... ఈ ఏడాది ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండటంతో చెరువులు అడుగంటే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో పశువుల తాగునీటికి ఇబ్బందులు తప్పవని అంచనా వేస్తున్నారు. పలు మండలాల్లో దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి తొట్టెల నిర్వహణపై దృష్టి సారించి నిధులు సమకూర్చి నీటి తొట్టెల నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి తొట్టెలు అవసరం



ప్రతి గ్రామంలోనూ పశువులకు నీటి తొట్టెలు అవసరం. నీటి తొట్టెల వల్ల పశువులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది. వేసవిలో చుక్కా నీరు చెరువుల్లో ఉండవు.. పంచాయతీలు నిధుల ద్వారా నీటి తొట్టెలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

టంకాల అచ్చెం నాయుడు, వైస్ ఎంపిపి, రేగిడి


బాధ్యత పంచాయతీలు తీసుకోవాలి



నీటి తొట్టెల నిర్వహణ, నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం తీసుకోవాలి. వేసవి తాగునీటికి పశువులు చాలా ఇబ్బందులు పడుతున్నాయి. కాగా చెరువుల్లో ఇంకిపోయిన బురద నీరు తాగి అనారోగ్యం పాలవుతున్నాయి. నీటి తొట్టెలు నిర్వహణలో ఉంటే వాటి ద్వారా మంచినీటిని పశువులకు పెట్టే అవకాశం ఉంటుంది.

నారు జనార్ధన, రైతు సంఘం నాయకులు,సంకిలి

నిధులు లేమి



గ్రామాల్లోని పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెల మరమ్మతులకు నిధులు లేవు. అలాగే నూతనంగా నిర్మాణాలు చేపడదామన్నా నిధులు లేవు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే నిర్వహణ, మరమ్మతులు చేపడతాం.

కాశీ విశ్వనాధ రావు, ఎంపిడిఒ, రేగిడి

ఆసరాతో ఆర్థిక భరోసా : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి – వేపాడ

మహిళలకు ఆర్థిక భరోసా వైఎస్ఆర్ ఆసరా అని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగడానికి సిఎం ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రతి మహిళ గుర్తించి రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని మరలా సిఎంను చేయాలని కోరారు. ముందుగా బిఆర్ అంబేద్కర్ గురుకుల వసతి గృహ బాలికల థింసా నృత్యం, కెజిబివి, ఆదర్శ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిసిసిబి చైర్మన్ వివి చిన్నరామనాయుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ ఎం కస్తూరి, ఎంపిపి డి. సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షుడు ఎం. జగన్నాథం, జిల్లా బిసి సంఘం చైర్మన్ ఎం సత్యనారాయణ, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈర్లే సన్యాసినాయుడు, మండల జెఎసి కమిటీ చైర్మన్ బోజంకి శ్రీను, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంఇఒ శ్రీదేవి, ఏపిఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

మధ్యలో వెనుదిరిగిన మహిళలు

సమావేశంలో నాయకుల ప్రసంగాలు కొనసాగుతుండగా విసుగు చెందిన మహిళలు కొంతమంది పాతపాటే పాడుతున్నారంటూ సమావేశం జరుగుతుండగా అక్కడ నుంచి వెనుదిరుగారు. గేటు వద్దకు వచ్చేసరికి విఒఎలు, గ్రామ వాలంటీర్లు గేటు తీయకపోవడంతో మహిళలు గేటు తొలగించుకొని వెళ్లిపోయారు.

దత్తిరాజేరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. వైయస్సార్ ఆసరా మూడో విడత నిధులు పంపిణీ ఉత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చెప్పింది చేసి చూపించే చేతల ప్రభుత్వం అని అన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి, పేదలకు మెరుగైన ఆరోగ్యం కోసం టిడిపి ప్రభుత్వం ఎప్పుడైనా ఆలోచించిందా? గ్రామీణ రోడ్ల మౌలిక సదుపాయాలకు పెద్ద పేట వేసిందా!



వేపాడ: మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీనివాసరావు

అని టిడిపి ప్రభుత్వం పై దుయ్యపడ్డారు. అక్క చెల్లెమ్మలు అందరూ జగన్మోహన్ రెడ్డికి మరో అవకాశం ఇచ్చి మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార స్టాల్సను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, ఎఎంసి చైర్మన్ వేమల ముత్యాల నాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, జిల్లా బిసి కన్వీనర్ మంత్రి అప్పలనాయుడు, వైసిపి మండల కన్వీనర్ కడుబండి రమేష్ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సమల శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ మహదేవ్, ఎంపిడిఒ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ రమేష్, వెలుగు ఎపిఎం అచ్యుతరావు, ఐసిడిఎస్ పిఒ నాగమణి, పలు గ్రామాలు సర్పంచులు, ఎంపిటిసిలు సభ్యులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బహిరంగంగా బెల్ట్ షాపుల వేలం

వేపాడ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం పాటలను నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల అరిగి పాలెంలో, సింగరాయ, డిఆర్‌పేట, బల్లంకి గ్రామాల్లో సుమారు రూ. 2లక్షలకు పైగా వేలం పాట పాడినట్లు తెలిస్తోంది. ఆతవలో రూ. 80వేలకు పాటను దక్కించుకున్నారు. బాణాదిలో అత్యధికంగా ఎనిమిది మంది పోటీ పడగా ఒక వ్యక్తి రూ.5.50లక్షలకు వేలం పాటను దక్కించుకున్నట్లు తెలిస్తోంది. ఆయా గ్రామాల్లో పంచాయితీల్లో కూడా మద్యం అమ్మకాలకు తీర్మానం జరిగినట్లు తెలిస్తోంది. ఈ విధానం అధికార పార్టీ సర్పంచులు ఉన్న చోటే జరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పైగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి అంతు చూస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. మద్యపాన నిషేదమని చెప్పి ఇప్పుడు వైసిపి నాయకులు గ్రామాల్లోనే మద్యం అమ్మించడం పట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ సిఐని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంట్యాడ : మోకాలపాడు జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజాన దాలినాయుడు (34) మృతి చెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. దాలినాయుడు పనిమీద బోనంగి వెళ్లి తిరిగి తన స్వగ్రామం కొత్త వెలగాడ వెళుతున్న క్రమంలో మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బోర్డును ఢీకొన్నాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆటోలు ఢీ

గుర్ల : మండలంలోని చుక్కపేట సమీపంలో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. వీరిలో గుర్ల గ్రామానికి చెందిన సారికి హైమావతి, సారికి రాజేశ్వరికి తీవ్రగాయాలయ్యాయి. ఒకరికి కాలు విరిగినట్లు స్థానిక పిహెచ్‌సి వైద్యులు తెలిపినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. వీరిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు భాదితుల కుటుంబ సభ్యులు తెలిపారు.

యల్లారమ్మ హుండీ చోరీ

జామి : జామి యల్లారమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైంది. ఆలయ ఇఒ ఎం. ప్రసాదరావు ఫిర్యాదు మేరకు జామి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం రాత్రి గుడికి తాళం వేసుకునీ సిబ్బంది వెళ్లిపోయారు. ఆదివారం తెల్లవారే సరికి గుడి తలుపులు తెరుచి ఉన్నాయి. స్థానికులు వెంటనే ఇఒకు సమాచారమివ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సి ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హుండీలో సుమారు రూ.35 వేలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 18 వరకూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లును ఇప్పటికే విద్యాశాఖ పూర్తి చేసింది. సమస్యాత్మక కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల వరకూ ఎటువంటి జెరాక్స్, ఇంటర్నెట్ దుకాణాలు ఉండకూడదని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. కాగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్‌టిసి సేవలు అందించనుంది.

ప్రజాశక్తి– రేగిడి

మండలంలోని సంకిలి, లక్ష్మీపురం, అంబాడ వెంకటాపురం, రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 3 నుంచి 18 వరకు 10వ తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. లక్ష్మీపురం పరీక్ష కేంద్రానికి 128 మంది విద్యార్థులు రేగిడి పరీక్ష కేంద్రానికి 165 విద్యార్థులు హాజరవుతారు. సంకిలి పరీక్ష కేంద్రానికి 80 మంది విద్యార్థులు, అంబాడ వెంకటాపురం పరీక్ష కేంద్రానికి 148 విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఎం రామినాయుడు, షణ్ముఖరావు,



రేగిడి: సంకిలి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ



వంగర : విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు

కృష్ణారావు రాజ్యలక్ష్మి, గురుమూర్తి, మురళి కృష్ణ, వాసుదేవరావు తెలిపారు. అన్ని తరగతి గదుల్లోనూ తగినంత వెలుతురు, ఫ్యాన్లు, బెంచీలు సిద్ధం చేశారు. రూట్ అధికారి ఎంఇఒ ఎం. వర ప్రసాద్ రావు సంకిలి పరీక్ష కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు.

పది పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

మండలంలోని సంకిలి, రేగిడి, లక్ష్మిపురం, అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎటువంటి జెరాక్స్ షాపులు, నెట్ సెంటర్లు ఉండరాదని సూచించారు. ఒకవేళ ఉన్నా పరీక్షకు గంట ముందే దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా గట్టి ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా సరే పరీక్ష కేంద్రాలకు వచ్చినా, విద్యార్థులకు ఇబ్బందులు పెట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు

వంగర: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు స్థానిక వివేక్ మాస్టర్ మైండ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భయాన్ని వీడి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు, చక్రపాణి, నేతాజీ పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మంచి ఫలితాలు

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని ఓక్ ల్యాండ్ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రముఖ సైకాలజిస్ట్, జన విజ్ఞాన వేదిక కన్వీనర్ డాక్టర్ ఏవి రాజశేఖర్ పరీక్షలు ఏవిధంగా సిద్ధం కావాలో వివరించారు. ఒత్తిడిని, పరీక్షల భయాన్ని జయించి మంచిగా పరీక్షలు రాసి విజయం సాధించాలన్నారు. దీనికి సంబంధించిన కొన్ని సూత్రాలను విద్యార్థులకు తెలిపారు. మెమోరీ టిప్స్‌ను, ఏకాగ్రత నిలుపుటకు ఉపయోగపడే నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.హెచ్ రవి, స్కూల్ కరెస్పాండంట్ డాక్టర్ పాల్ శ్రీనివాస్, గౌరవ చైర్మన్ శివన్నారాయణ, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: విద్యార్థులకు సూచనలు చేస్తున్న సైకాలజిస్టు